ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు జరగాలి

అల్వాల్: ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు జరగాలని కాంగ్రెస్ నాయకులు టి.మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం భరత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ..రెండు రోజుల క్రితం కౌకూర్‌లో 18 అడుగుల రోడ్డు ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితమే 18 అడుగుల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ 30 అడుగుల రోడ్డు నిర్మాణం చేయాలని కోరారన్నారు. రోడ్డు నిర్మాణానికి ముందు డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు చేయడం వల్ల మరోమారు రోడ్ల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉండదని స్థానికులు కోరారని అన్నారు. కాలనీ స్థానికుల అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోకుండా మళ్లీ 18 అడుగుల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం శోచనీయమన్నారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నాము తప్పా అభివృద్ధికి ఆటంకం కలిగించడం లేదన్నారు.

ప్రతి ఒక్కరికీ చేయూతనిద్దాం



బ్లైండ్ పీపుల్స్‌కు ఆర్థిక సహాయం చేస్తున్న విద్యార్థులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ చేయూతనిద్దామని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యా జ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ తోటి విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించి చెంగిచర్లలోని స్ఫూర్తి ఫౌండేషన్‌లోని బ్లైండ్ పీపుల్స్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లైండ్ పీపుల్స్ కూడా అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారన్నారు. వారికి తమవంతుగా పాఠశాల విద్యార్థుల ద్వారా ఆర్థిక సహాయం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం



దీపక్ జాన్‌ను సన్మానిస్తున్న క్రైస్తవులు

ఉప్పల్: స్వరూప్‌నగర్‌లో హోరేబు చర్చి ఫౌండర్ గొన పిలిఫ్, గొన అనిల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. బిషప్ ఆశీర్వాదం మాట్లాడుతూ.. క్రైస్తవులు బైబిల్ చదవడమే కాదు ఆ ప్రకారం పరిశుద్ధ జీవితం, మంచి సాక్ష్యంతో అందరికీ సువార్తను ప్రకటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుచరణ్, రమేష్, అగ్రప్ప, బీసీకే దేవదానం, రవిచంద్ర, జేరుషలేము మత్తయ్య, ఉప్పల్ పాస్టర్స్ పాల్గొన్నారు.

సందడిగా కార్నివాల్



నాచారం డక్కన్ స్ప్రింగ్స్ పాఠశాలలో..

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో చిల్డ్రన్స్ డే కార్నివాల్‌ను ఏర్పాటు చేశారు. వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ కాటన్ మిఠాయి, పాప్‌కార్న్, చాక్లెట్ ఫౌంటేన్ అనేక రకాల రుచికరమైన పదార్థాలు, పిల్లలకు మ్యూజిక్ షోలు, సంగీత ప్రదర్శనలు, డ్యాన్స్, పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నవనీతారావు, డైరెక్టర్ నవీన్‌కుమార్, కిషోర్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమామీనన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై చిన్నారులకు అవగాహన



మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ వెస్ట్ శ్రీ కృష్ణనగర్ కాలనీలోని చిన్నారులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే ట్రాఫిక్, రోడ్ సేఫ్టీ గురించి అవగాహన ఉండాలన్నారు. స్కూల్‌కు సైకిల్ మీద వెళ్లి వచ్చేటప్పుడు రోడ్డుకు ఒక వైపుననే ఉండాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఉన్న ప్రాంతంలో ఫుట్‌పాత్ మీదనే నడవాలన్నారు. ముఖ్యంగా కొందరు తల్లిదండ్రులకు తెలియకుండా ద్విచక్రవాహనాలను తీసుకొని రోడ్డు మీదకు వస్తారని, దీనివల్ల వారికే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీనివాస్, రాము, లక్ష్మణ్, శశాంక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు



మరకత శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానంలో శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి వ్రతం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు క్యూ కట్టారు. శివాలయాలు, వైష్ణవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో కుటుంబ సమేతంగా దీపాలు, వత్తులు వెలిగించారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్లబృందం



పుష్పాభిషేకం అనంతరం మూలవిరాట్



రామంతాపూర్ సత్యదేవుని ఆలయంలో..



ఆరెకేపురంలో ఉసిరి చెట్టు కింద పూజలు చేస్తున్న తడక జగదీశ్వర్‌గుప్తా



మల్లాపూర్‌లో శివుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



శివలింగానికి అభిషేకం



మారుతీనగర్ శివాలయంలో..



నాచారంలో..



ఉప్పల్ వెలుగుట్ట ఆలయంలో..



మహాభిషేకంలో పాల్గొన్న భక్తులు



శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

రేపు కాపు కులాల వనభోజన మహోత్సవం

కుషాయిగూడ: పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కాప్రా కాపు కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేపు వనభోజన మహోత్సవాన్ని నిర్వహించ తలపెట్టినట్లు ఐక్యవేదిక అధ్యక్షుడు జి.వి.ఎన్. రావు తెలిపారు. వనభోజన మహోత్సవ కరపత్రాన్ని శుక్రవారం వేదిక ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాపు రజోత్సవ వనభోజన మహోత్సవం పేరుతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కీసర ఓఆర్‌ఆర్ సమీపంలోని కాపు కల్యాణ మండప ట్రస్టు వద్ద నిర్వహించే ఈ వేడుకల్లో కాపులు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరుకాపు, తూర్పుకాపు సోదరులంతా పాలుపంచుకొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా కాపు కులాల ఐక్యవేదిక ప్రదాన కార్యదర్శి వి.నాగు, ప్రతినిధులు రెడ్డి శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాస్‌రావు, దాసరి ప్రసాద్, శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న అధ్యక్షుడు జి.వి.ఎన్. రావు తదితరులు

అభివృద్ధి పనులు ప్రారంభం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ జీకేఆర్ కాలనీలో రూ.12 లక్షల వ్యయంతో బోర్‌వెల్ పనులు, పార్కు అభివృద్ధి పనులను శుక్రవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, లడ్డూ, ఆనంద్, రమేష్, వెంకటేష్, దేవేందర్, వెంకట్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు నికోలస్, జలందర్‌రెడ్డి, వంశీ, అరుణ్, ఆశీష్, అశోక్‌రెడ్డి, హరినారాయణ పాల్గొన్నారు.



ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే



గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం

రామంతాపూర్: ఇందిరానగర్ కాలనీలోని ప్రతిభ విద్యానికేతన్‌లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రానురాను కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతున్న తరుణంలో విద్యార్థులకు కుటుంబ విలువలపై అవగాహన కల్పించడానికి గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గాదె సత్యనారాయణ, ఇన్‌చార్జి ప్రియాంక, విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మల్లాపూర్: డివైడర్‌ను ఢీకొని గుంతలో కారు బోల్తాపడిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ నాగలక్ష్మీనగర్‌కి చెందిన గజ్జేల శివ కారులో ఇంటికి వస్తున్నాడు. మల్లాపూర్ ప్రధాన రహదారిలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారు కాస్త గుంతలో పడి పల్టీ కొట్టింది. దీంతో కారులో ఉన్న నాలుగురికి స్వల్ప గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

సిలిండర్ నుంచి మంటలు.. ఒకరికి గాయాలు

అల్వాల్: ఫాస్ట్‌ఫెడ్ సెంటర్‌లో వంట చేస్తుండగా సిలిండర్‌లో నుంచి గ్యాస్ లీకై ఒకరు తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హస్మత్‌పేట్ ప్రధాన రహదారిపై గల ఆల్ స్పైసీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో శుక్రవారం వంట చేస్తుండగా అకస్మాత్తుగా సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన హోటల్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. హోటల్ యజమాని అఫ్సర్ (30) కి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రిల్స్ తొలగించి.. రూ.8లక్షల చోరీ

మల్లాపూర్: హోల్‌సేల్ షాపు గ్రిల్స్ తొలగించి రూ.8 లక్షల నగదును చోరీ చేసిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ పారిశ్రామికవాడలోని రోడ్ నెంబర్:16లో దేవీ శాంతి ఫుడ్ వెండర్ హోల్ సేల్ షాపుని సీఎస్ శర్మ నడిపిస్తున్నాడు. దాదాపు రూ.8 లక్షల నగదును షాపులోనే ఉంచి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం 8 గంటల షాపునకు వచ్చిన శర్మ చూసే సారికి షాపు వెనుకాల ఉన్న గ్రిల్స్ తొలగించి ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.8 లక్షల నగదు కూడా చోరీకి గురైనట్లు గుర్తించాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో నగదును ఓ దుండగుడు గ్రిల్స్ తొలగించి నగదును ఎత్తుకువెళ్లినట్లు సీసీ పుటేజీలో దృశ్యాలు రికార్డు అయింది. సంఘటన స్థలాన్నికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్‌లో రాక్‌వెల్ మొదటి శాఖ ప్రారంభం



రాక్‌వెల్ ఫ్రీజర్ శాఖను ప్రారంభిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌గుప్తా

ఉప్పల్: ఆధునిక యంత్రాలతో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ నిర్వహిస్తున్న రాక్‌వెల్ ఉత్పత్తులు పారిశ్రామిక రంగంలో నూతన ఒరవడులు సృష్టిస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌గుప్తా అన్నారు. శుక్రవారం ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీలో రాక్‌వెల్ తన మొట్ట మొదటి శాఖను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఫ్రీజింగ్ టెక్నాలజీలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ ఫ్రీజర్లు, వాటర్ కూలర్‌లు, డిస్పెన్సరీలు, మిఠాయి షోకేజిలు, బార్ రిఫ్రిజిరేషన్ యూనిట్లు వంటి శీతలీకరణ యూనిట్లను మార్కెట్ కన్నా తక్కువ ధరలకే అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటర్‌ప్రైజెస్ డిస్ట్రిబ్యూటర్ రవి చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. విద్యామారుతీనగర్ కాలనీకి చెందిన లబ్ధిదారు కుటుంబ సభ్యురాలు కనక దుర్గకు రూ.40 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆపద ఉన్నవారికి సీఎం సహాయనిధి ఆపన్నహస్తంగా పనిచేస్తుందన్నారు. అర్హులైన పేదలు ఆర్థిక చేయూతని చ్చేందుకు దోహదపడుతుందన్నారు.

నేతాజీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన..

నేతాజీనగర్ కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటుగా చేయాల్సిన పనులపై సంక్షేమ సంఘం ప్రతినిధులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, తాగునీటి, సీసీ రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, పాండు, వెంకట్‌గౌడ్, పెద్దపల్లి శ్రీనివాస్, మురళిగౌడ్‌తో పాటుగా సంక్షేమ సంఘం ప్రతినిధులు మహేష్, ఐలేందర్, గణేష్‌గౌడ్, అశోక్, శ్రీనివాసరాజు, సువర్ణ, పద్మావతి, ఆలేఖ్య, సత్తమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.